# అవకాశం

**అంతకంతకూ వాన అధిక మవుతూంది తప్ప తగ్గే సూచనలు ఏ మాత్రం కనబడ్డం లేదు. దానికి తోడు చీకటి! గాఢాంధకారం. అగ్గిపెట్టె ఎక్కడ ఉందో తెలీదు. టార్చిలైటు కూడా కనబడ్డం లేదు. ఈదురుగాలి కొడుతున్నది. గాలి విసురుకి కిటికీ తలుపులు ధన్ ధన్‌మని గట్టిగా కొట్టుకుంటూ మరింత భయాన్ని పుట్టిస్తున్నాయి.**

చీకటంటే చచ్చేంత భయం సుజాతకి! ఎక్కడ లేని పాడు ఆలోచనలు ఆ నిమిషంలోనే వస్తాయి ఆమెకి. అందులోనూ ఇంట్లో ఎవరూ లేని సమయంలో రాత్రిపూట కరెంటు పోతే ఆమె భయం వర్ణనాతీతం!

ఉన్నట్టుండి కళ్ళు మిరుమిట్లు గొలిపేలా మెరుపులు! చెవులు హోరెత్తి పోయేలా ఉరుములు! గాలి వానలో కొట్టుకుపోతున్న చిగురుటాకులా భయంతో వణికి పోసాగింది సుజాత. తడుముకుంటూనే వంటింట్లోకి వెళ్ళింది అగ్గిపెట్టె కోసం. ఎలాగో సంపాదించింది. హరికేన్ లాంతరు వెలిగించింది. లాంతరు వీధి గది కిటికీలో పెట్టి భర్త కోసం ఎదురు చూడసాగింది.

అరగంట గడిచేక వాన ఉధృతం తగ్గింది. మెరుపులు, ఉరుములు కూడా తగ్గేయి. గాలితో పాటు ఏటవాలుగా కాక, నిలువుగా కురుస్తూంది వాన. వీధి అరుగు మీద ఒక చివర్న చిన్న స్టూలు వేసు క్కూర్చుని అన్ని దేముళ్ళకీ మొక్కేస్తూంది - కరెంటు త్వరగా రావాలనీ, వాన పూర్తిగా త్గపోవాలనీ, తన భర్త క్షేమంగా తిరిగి వచ్చేయాలనీ.

ఉదయమే ఏదో పని ఉందని దగ్గర్లో ఉన్నవూరుకి బస్సులో వెళ్ళాడు జగన్నాథం. వెళ్ళిన పని ఇంకా కాలేదో, లేదా వర్షం వల్ల ఆలస్యమయిందో భర్త ఇంకా రాలేదు. లేదా తోవలో చెట్లు చేమలు ఏవైనా రోడ్డుకి అడ్డంగా పడ్డాయేమో? బస్సు ముందుకు పోలేక తోవలోనే ఉండిపోయిందేమో? లేదా చీకట్లో, వర్షంలో వస్తూ వస్తూ ఏ బురదలోనైనా బస్సు కూరుకు పోయిందేమో?!... అంత చల్లటి గాలిలోనూ ముచ్చెమటలు పోశాయి ఆమెకి.

'భగవంతుడా! ఆయన త్వరగా వచ్చేస్తే బాగుణ్ణు. ఈలోగా లైట్లు కూడా వచ్చేస్తే బాగుణ్ణు.' భయంగా మనసులోనే దేవుడికి దణ్ణం పెట్టుకుంది సుజాత.

అకస్మాత్తుగా లైట్లు వెలిగేయి. 'హమ్మయ్య' అనుకుంది. లేచి వెళ్ళి లాంతరు ఆర్పేసింది.

వీధి గుమ్మంలో చప్పుడు - జగన్నాథం సగం తడిసి ఉన్నాడు. "సారీ, సుజా! బస్సు రావటం లేటయింది. తోవలో వర్షం... కరెంటు లేదు. బెంగ పెట్టుకున్నావా..." సుజాత అందించిన టవలుతో తల తుడుచుకుంటూ అన్నాడు జగన్నాథం.

అలా అనగానే సుజాతకి దుఃఖం ముంచుకొచ్చింది. కరెంటు లేకపోవడం, చీకట్లో ఒంటరిగా తను ఎలా ఉన్నదీ, తన భయాలూ, ఆందోళనలూ, ఆలోచనలూ - అన్నీ ఏకరువు పెట్టేసి అతని గుండెలో తల దాచుకుని ఏడ్చేసింది. అంత పిరికిది సుజాత! ఆ విషయం జగన్నాథానికి తెలుసు.

తనంటే భార్యకి ఎంత ప్రేమో కూడా తెలుసు. అందుకే భార్య మనస్సుని కష్టపెట్టే పని ఎప్పుడూ చెయ్యడు. ఎప్పుడు బయటకు వెళ్ళినా చెప్పిన టైముకే సాధారణంగా వచ్చేస్తూంటాడు.

"నేను వచ్చేసేనుగా. వూరుకో, సుజా. అయినా ఈ మాత్రానికే అంత భయమేమిటి - పిచ్చిపిల్లా!" ప్రేమగా జుత్తు నిమిరేడు.

వేడి వేడి పరోటాలు, మసాలా కూర చేసింది సుజాత. తినడం ముగించి ఇద్దరూ ఇవతలికి వచ్చేరు.

"అన్నట్టు చెప్పడం మరిచాను. రేపు ఉదయం మనింటికి ఒక గెస్టు వస్తున్నాడోయ్!"

"గెస్టా?" భర్త కూర్చున్న కుర్చీకి దగ్గరగా తన స్టూలుని జరుపుకుంటూ అంది.

"అవును, నా ఫ్రెండొకడు. ఏదో పని ఉందట. ఈ వూళ్ళో ఇవాళ అక్కడ కలిసేడు. రేపు వస్తాట్ట. రెండు రోజులుండాలిట. తప్పకుండా మనింట్లోనే దిగమన్నాను. నా అడ్రసిచ్చేను." అన్నాడు జగన్నాథం.

సుజాత మొహం అదోలా పెట్టింది. ఆ మాట విని, ఆమె ఆలోచనలన్నీ విశాల చుట్టూ తిరగడం మొదలెట్టాయి. ముభావంగా ఉండిపోయింది.

"ఆహఁ... అదేం లేదు. పొద్దున్నకి కూరలు చాలవు. బజారుకెళ్ళి తెచ్చుకోవాలి..." గొణుక్కుంటున్నట్టుగా అంది సుజాత.

"అంతేనా! పొద్దున్నే సంచి పట్టుకుని బజారుకెళ్ళనూ! ఇంకా ఏవైనా నిండుకుంటే చెప్పు. పొద్దున్నే తెచ్చి పడేస్తాను. సాంబారు గుత్తి వంకాయ, అరటికాయ వేపుడు. కొబ్బరికాయ పచ్చడి, సేమ్యాపాయసం పులిహోర... నీకెంత వోపికుంటే అంత చెయ్యి"

"అబ్బ! ఆమాత్రం నాకు తెలీదేమిటి?"

"వచ్చినవాడు ఎన్ని రోజు లుంటాడో మనం చెప్పలేం. అతనెన్ని రోజులున్నా, మనం ఏ లోపం రానివ్వకూడదు." ఆ మాటలు విని రుస రుసలాడిపోయింది సుజాత.

"ఊరుకోండి, పెద్ద! మీకే మర్యాదలు తెలిసినట్టు"

★ ★ ★

తల ఎత్తితే ఎదురుగా కనబడే దృశ్యం సుజాతకు తెలుసు. అయినా చూడకూడదను కుంటూనే తలెత్తి చూసింది.

అక్కడ ఉన్నది నుయ్యి ఒక్కటే అయితే ఫర్వాలేదు. ఆ నూతి పక్కనే అతను... లుంగీ పిండుకుంటూ గుండె మీద ఒత్తుగా పెరిగిన నల్ల వెంట్రుకలు, బలిష్టమైన భుజాలు అక్కడక్కడ ఒంటిమీద నున్నటి నీటి బిందువులు ఆ ఎండలో వింతగా మెరుస్తున్నాయి! వెంటనే తల దించేసుకుంది.

అలా చూడ్డం తప్పని తెలుసు.

ఒక్క క్షణమైనా సరే... తప్పే. తను చూడ్డం అతను గమనించ లేదు కదా. ఒళ్ళు వణికింది.

కూర్చున్న జాగాలోంచి లేచిపోయింది ఏదో పెద్ద పని ఉన్నట్టు! స్టౌ దగ్గరకి నడిచింది కూర కలుపుదామని. అప్పుడే స్టౌ మీద పెట్టింది. కలపాల్సిన అవసరం ఇంకా రాలేదు. అయినా గరిటతో పెద్ద శబ్దం చేస్తూ కలిపి మరిన్ని నీళ్ళు పోసి కూర మీద మూత పెట్టింది. గబగబా నడుచుకుంటూ వచ్చి ఇందాక కూర్చున్న జాగాలో ఉన్న కత్తిపీటని గోడవారగా పెట్టింది. వచ్చినంత తొందరగా మళ్ళీ వెళ్ళింది మరో గదిలోకి. చాలా తొందర పనిలో అటూ ఇటూ తిరుగుతున్నట్టు అతను అనుకోవాలి క్షణం తీరిక లేని దానిలా ఏవేవో గిన్నెలు డబ్బాలు చక్క పెట్టేస్తూంది. ఒక చోట కాలు నిలవడం లేదు. గుండెలో ఏ మూలో భయం వణుకు. విశాల మాటలే చెవుల్లో గింగురుమంటున్నాయి. దాని మాటల్లో ఎంత నిజం ఉందో? అదిస్వానుభవం మీద చెప్తున్నానంది. 'అవకాశం అంటూ వస్తే ఏ మగాడూ చస్తే వదులుకోడు'- అంది. "మనం ఏమాత్రం చనువుగా ఉన్నా చొరవచేస్తాడు. ఈ మగాళ్ళని చస్తే నమ్మకూడదు" అంది! తన మాట అబద్ధమైతే చేతిగాజులు ఇచ్చేస్తానంటూ, గాజులు చేతినుంచి తీసేసింది కూడా! తనే వారించింది - "అదేం పనే మొద్దూ" అంటూ. కావాలంటే 'టెస్టు' చెయ్యమంది. కాని... కాని... జగన్నాథం "నా ఫ్రెండొకడు గెస్టు..." అంటే ఇతనే అని ఎలా వూహిస్తుంది తను మాత్రం!...

పెళ్ళి చూపులయ్యాక "మా వాడికి మీ అమ్మాయి నచ్చింది" అన్నారు వాళ్ళు. నాన్నకి జాతకాల పిచ్చి. జాతకాలు చూసి నిట్టూర్చేసి, వీళ్ళిద్దరికీ పెళ్ళి చేస్తేషష్టాష్టకం అనీ, కాల సర్పయోగం అనీ, ఇదనీ అదనీ మొత్తానికి జాతకాలు సరిపోవడం లేదని జాతకాలు గాని పడి ఉంటే బంగారం లాంటి సంబంధం అనీ, అమ్మాయికి అంత అదృష్టం లేదనీ వాపోయేరు! అక్కడికది మర్చిపోయింది తను కూడా...

ఏ ఆడదైనా తనకి పెళ్ళికాక ముందు కొందరితో అయిన పెళ్ళి చూపుల గురించి భర్తకి చెప్తే అతగాడు విని భరించలేడు 'అయితే పెళ్ళిచూపులన్నప్పుడు ఎంత మందిని నీభర్తలుగా వూహించు కున్నావు?' అని టక్కున అడిగేస్తాడు ఏ మగాడైనా! అందుకే తను ఎప్పుడూ అలాంటి విషయాలు భర్త దగ్గర ఎత్తదు. మళ్ళీ ఇన్నాళ్ళకి అతను ఇలా గెస్టుగా రాగానే విశాల మాటలు పదేపదే జ్ఞాపకం వచ్చి వణికిపో సాగింది ఆమె.

★ ★ ★

"నా గురించి నువ్వు ఆఫీసుకి లేటుగా వెళ్ళడం ఎందుకు? ఆఫీసులో బోలెడు వర్కుందంటున్నావు. నువ్వు భోంచేసి వెళ్ళిపో. నేనేం అనుకోను. నాకు తొందర లేదు. నేను మధ్యాహ్నం పన్నెండు తరువాత వెళ్తాను" అతను భర్తతో అంటూంటే వింది.

ఆ మాటతో పెద్ద రిలీఫ్ ఫీలయ్యేడు జగన్నాథం. సుజాత దగ్గరకొచ్చి చెప్పేడు - "నేను భోంచేసి ఆఫీసుకి వెళ్ళిపోతాను. శేఖరం పన్నెండు తర్వాత భోంచేస్తాట్ట - జాగ్రత్తగా వడ్డించు."

జగన్నాథం ఆఫీసుకి వెళ్ళడానికి తయారవుతున్నాడు. సుజాత వచ్చింది గదిలోకి.

"ఏమండీ! ఇవాళ వేగం వచ్చీ కూడదూ ఆఫీసు నుంచి..." దగ్గరగా వచ్చి గుండీలు సవరిస్తూ అతని కళ్ళలోకి చూస్తూ గోముగా అంది.

ఒక చేత్తో ఆమెను మరింత దగ్గరకు లాక్కుని హృదయానికి హత్తుకుంటూ, ముందుకు వంగి మరో చేత్తో ఆమె చుబుకాన్ని పైకెత్తి సుతారంగా పెదవులపై ముద్దు పెట్టుకున్నాడు.

"నాకు మాత్రం వేగం వచ్చేయాలని ఉండదూ? ఇవాళ ఆఫీసులో బోలెడంత వర్కుంది కానీ, ట్రై చేస్తాను వేగం రావడానికి..."

స్కూటరు స్టార్టు చేస్తూ మరో సారి అన్నాడు జగన్నాథం - "సారీ రా, శేఖరం. ఇవాళ అసలు సెలవు పెట్టేద్దామనుకున్నాను. కాని మార్చి ఎండింగు. బోలెడు పని ఉంది. మరేమనుకోకు."...

వంటిల్లు సర్దుతోంది సుజాత.

"హెయిరాయిల్ ఉందండీ?" వంటింటి గుమ్మం దగ్గర నించున్న శేఖరాన్ని చూడగానే గతుక్కుమంది సుజాత. వెంటనే విశాల జ్ఞాపకం వచ్చింది. కొంపతీసి విశాల మాటల్లో నిజం లేదు కదా!... భయాన్ని కప్పి పుచ్చుకుంటూ, తడబడుతూ లేచి "ఆ గదిలో టేబుల్ మీదుందండి..." అనగలిగింది.

అతను అటు నడిచేడు. మళ్ళీ అంతలోనే 'అయ్యో! తల నూనె అడిగితే తనెందుకంత భయపడిపోవడం? తనే వెళ్ళి ఆ నూనె సీసా తీసుకొచ్చి చేతికిస్తే మర్యాదగా ఉంటుంది. 'మర్యాదలేని మనిషి అనుకుంటాడేమో!' వెంటనే వెళ్ళింది అతని వెనకాలే. "కనిపించిందా?" అంటూ. నూనె సీసా చేతి కిచ్చింది. సీసా కింద పడిపోతుందేమో అన్నంతగా చేతి వేళ్ళు వణికేయి. అతను చిన్నగా నవ్వుకున్నట్టు ఎందుకో అనిపించింది. కాని అతని మొహంలోకి చూడలేకపోయింది.

అతను భోజనాని క్కూర్చున్నాడు. 'కొసరి కొసరి వడ్డించాలి' అని భర్త చెప్పిన మాటలు జ్ఞాపకం వచ్చి ఇంకా అన్నం, కూరలు, అన్నీ తీసుకొచ్చి వడ్డించబోయింది.

"వద్దు, వద్దు" - నవ్వుతూ చెయ్యి అడ్డు పెట్టేడు. అతని చేతివేళ్ళు సుజాత గాజులకి తగిలేయి.

ఒళ్ళు జల్లుమంది. అతను కావాలనే చేయి అలా తగిలించేడా? నోటితో చెప్పొచ్చుగా వద్దని! విశాల మాటల్లో ఖచ్చితంగా నిజం ఉండి ఉంటుంది. ఎలాగ? ఇప్పుడేది దారి? గుండె వేగంగా కొట్టుకోసాగింది. ఈయన త్వరగా ఆఫీసు నుంచి వచ్చేస్తే బాగుణ్ణు.

కంచంలో చేయి కడుక్కుని లేచేడు శేఖరం... "అగ్గిపెట్టె ఇస్తారా?" సుజాత నిల్చున్న వైపుకి వస్తూ అడిగేడు. పరధ్యాన్నంలో ఉన్న సుజాత ఉలిక్కి పడింది. ఎదురుగా స్పీడుగా వస్తున్న లారీని అల్లంత దూరంలో చూసి పల్లెటూరివాళ్ళు పక్కకి తప్పుకున్నట్టు ఒక వారకి వెళ్ళి నించుంది.

"ఆఁ ఏమిటి?" పలుచగా తడబడుతూ.

అతని పెదవులు పలుచగా నవ్వాయి. "అగ్గిపెట్టె కావాలి!"

"అగ్గిపెట్టె కోసం వంటింట్లోకి వెళ్తే అతను కూడా వెనకాలే వచ్చేస్తాడేమో... ఏదైనా చేసేస్తాడేమో అని భయం! అతను 'కావాలి' అన్నది అగ్గి పెట్టె అయినా, తనకి ఆ 'కావాలి' అన్న పదం అదోలా వినిపించింది. మొహం ఎర్రగా చేసుకుని వెళ్ళి అగ్గిపెట్టె తెచ్చింది.

వాలు కుర్చీలో కూర్చుని సిగరెట్టు పొగని విలాసంగా వదులుతూ వీధివైపు చూస్తున్నాడు శేఖరం. పావు గంట గడిచినా అతను ఎక్కడికీ వెళ్ళకపోవడం ఆమెకి ఆశ్చర్యం కలిగించింది. ఏదో ఆఫీసు పనిమీద ఈ వూరు వచ్చేడన్నారు. ఎప్పటికీ వెళ్ళడేమిటి? 'పనుండడం' నిజం కాదా!?

కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లా ఉంటుంది వాళ్ళ ఇల్లు. గదిలో గది. పెరట్లో కెళ్ళాలంటే గదులన్నీ

దాటుకుని వెళ్ళాలి. పొద్దున్నించీ అలసిపోయి ఉంది పనులతో. కాసేపు పడుకుందామంటే... ఎలాగ? తను పడుకున్న తర్వాత అతను లోపలికి వచ్చేస్తే?... అమ్మో!... పోనీ అతన్ని "కాసేపు పడుకుంటారా?" అని మర్యాదకి అడుగుదామంటే, సిగ్గు... భయం. ఏం చెయ్యడానికీ తోచక అలా కూర్చుండి పోయింది. కాని మనస్సు స్థిమితంగా లేదు. లేచి వెళ్లి ఫాన్ స్విచ్ ఆపేసింది. అంతకంటే ఇంకేం చెయ్యాలో తోచలేదు.

శేఖరం కుర్చీలోంచి లేచేడు. లోపలికి వచ్చేడు. అతన్ని చూసి సుజాత మరో గదిలోకి వెళ్ళిపోయింది. పెద్ద పులిని చూసి బెదిరిపోతున్న లేడి పిల్లలా ఉంది ఆమె పరిస్థితి! అతని కిది మంచి అవకాశం! ఏం చేసినా చెయ్యొచ్చు. 'వచ్చిన అవకాశాన్ని ఏ మగాడూ వదులుకోడు'- అంది విశాల. తనని ఏదైనా చేస్తే... ముచ్చెమటలు పోసేయి ఆమెకి. ఏవేవో వూహించుకుని విపరీతంగా భయపడసాగింది.

కొంత సేపయ్యాక అతను బ్రీఫ్‌కేస్ చేత్తో పట్టుకుని ఇవతల కొచ్చాడు

"తలుపు వేసుకోండి. నేను వెళుతున్నాను.." పొడి పొడిగా చెప్పేసి అతను బయట పడ్డాడు.

అతను వీధి గుమ్మం దిగేక 'హమ్మయ్య' అని నిట్టూర్చింది సుజాత. లోపలికి వచ్చింది. అతని తాలూకు వస్తువులు - అంటే లుంగీ, తువ్వాలు వగైరాలు - లేవు. ఎందుకో ఒక్క నిమిషం గిల్టీగా ఫీలయింది. ఏమో... ఆఫీసు కాగితాలూ అవీ బ్రీఫ్‌కేసులో పెట్టుకుని ఉంటాడు. లుంగీ, తువ్వాలు కూడా ఆరిపోయేయని అందులో పెట్టేసుకుని ఉంటాడు. ఉన్నది అదొక్కటే సామాను కదా. ఎక్కడికి వెళ్ళినా అది తీసుకెళ్తేగాని కాదు- అని సర్ది చెప్పుకుంది.

అలా మధ్యాహ్నం వెళ్ళిన శేఖరం రాత్రి ఎనిమిది అయినా రాలేదు. భర్త వెంట వచ్చేస్తాడనుకుంది. జగన్నాథం కూడా ఆఫీసు నుండి వచ్చేక చాలా ముభావంగా ఉండడం గమనించింది సుజాత.

"మీ ఫ్రెండు రాలే దేమండీ?"

"మధ్యాహ్నం ఆఫీసు కొచ్చేడు" అన్నాడు జగన్నాథం పొడిగా.

"అతని కోసం కూడా వండేసేను."

"అతను రాడు."

"అదేం? రెండు రోజుల పనీ ఒక్క పూటలోనే అయిపోయిందా?"

"శేఖరం చాలా మొహమాటస్తుడు. మనింట్లో ఉండడానికి వాడికి ఎందుకు నచ్చలేదో, ఎలాంటి ఇబ్బంది ఉందో తెలీదు గాని- నేను ఉంటే మీకు ఇబ్బందిరా. ఎందుకు నా గురించి హైరానా పడతావు? లాడ్జి కెళ్ళిపోతాను. మరేమనుకోకు- అన్నాడు వాడు. నేను బ్రతిమాలినా రాలేదు" అన్నాడు జగన్నాథం భోజనానికూర్చుంటూ.

అవాక్కయిపోయింది సుజాత. మనసులో ముల్లు గుచ్చుకున్నట్టయింది.

'విశాల మాటల్లో నిజం లేదు. నా అనవసర భయాలతో ఇంటి కొచ్చిన పెద్ద మనిషికి ఇబ్బంది కలిగించేను' అని బాధ పడింది...

★ ★ ★

*(ఆంధ్రప్రభ, వీక్లీ ; 21-10-1981)*